'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను
ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి.
చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034.
e-mail: editpage@ntnews.com

నమస్తే తెలంగాణ

నీట్‌పై నీలినీడలు

వైద్య కళాశాలలో ప్రవేశాలకు పోటీ అధికంగా ఉంటుంది. సీట్లు తక్కువగా ఉండటం, అభ్యర్థులు లెక్కకు మిక్కిలిగా ఉండటమే అందుకు కారణం. దాంతో సహజంగానే కఠినమైన ప్రవేశ పరీక్షలు నిర్వహిస్తారు. దేశవ్యాప్తంగా వివిధ వైద్య కళాశాలల ప్రవేశాలకు నిర్వహించే పరీక్షలన్నిటినీ ఒకే గొడుగు కిందకు తెస్తూ కేంద్రం 2017లో నీట్ పరీక్షను ప్రవేశపెట్టింది. రాష్ట్రాల ఆధ్వర్యంలో జరిగే ప్రవేశాలను కేంద్రం జాతీయ పరీక్ష పేరిట తన గుప్పిట్లోకి తీసుకున్నది. వికేంద్రీకృత పద్ధతిలో ఉండే లొసుగుల తొలగింపు, పకడ్బందీ నిర్వహణ అనే బృహత్తరమైన లక్ష్యాన్ని కేంద్రం టాంటాం వేసుకున్నది. వాస్తవానికి అదంతా డొల్లేనని తాజా ఫలితాలపై చెలరేగిన దుమారం తేటతెల్లం చేసింది. నీట్ అనేది ఓ అవకతవకల పుట్టగా మారిందని రోజురోజుకు వెలుగుచూస్తున్న అక్రమాలు సూచిస్తున్నాయి. పేపర్ లీకులు, గ్రేస్ మార్కుల వంటి పరీక్షా నిర్వహణ లోపాలకు తోడుగా పరీక్షా కేంద్రాల్లో అక్రమాలు జరిగినట్టు తెలుస్తున్నది.

లక్షలమంది అభ్యర్థులు కోటి ఆశలతో రాసే పరీక్ష నిర్వహణ ఓ ప్రహసనంలా మారింది. ఈసారి 67 మంది అభ్యర్థులకు ప్రథమ ర్యాంకు రావడం నీట్ ప్రహసనంలో హైలైట్. అలాగే సుమారు 1563 మంది విద్యార్థులకు 'సమయాభావమైందని' అంటూ గ్రేస్ మార్కులు కలపడం నీట్ లీలలకు పరాకాష్ఠ. ఈ గ్రేస్ మార్కులు చెల్లవంటూ సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం అసమర్థ నిర్వహణకు చెంపపెట్టు లాంటిది. నీట్ అక్రమాలపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ 'అక్రమాలు జరిగిన మాట వాస్తవమే.. బాధ్యులపై చర్య తీసుకుంటాం' అనే రొటీన్ ప్రకటనతో చేతులు దులుపుకొన్నారు. ఈ పరీక్ష నిర్వహణ కోసం ఏర్పాటు చేసిన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్టీయే)ని కేంద్రంలోని పాలక బీజేపీ 'అస్మదీయుల'తో నింపేసిందనే ఆరోపణలున్నాయి. ప్రస్తుత వివాదంలో ఎన్టీయే డైరెక్టర్ హాస్యాస్పదమైన రీతిలో ఇస్తున్న డొంకతిరుగుడు సమాధానాలు విస్మయం కలిగిస్తున్నాయి. నీట్‌లో కేంద్రమంత్రుల జోక్యం ఎన్టీయే స్వయంప్రతిపత్తిని నీరుగారుస్తున్నదనే ఆరోపణలూ వినవస్తున్నాయి.

ఎన్టీయే వేసింది బీజేపీ ప్రభుత్వమే. అక్రమాలకు బాధ్యత కూడా వారిదే. ఇప్పుడు 'నేరస్థులపై' చర్యలు తీసుకుంటామని అంటున్నదీ వారే. లీకైన పేపర్లకు లక్షల్లో బేరాలు పెడుతున్న అక్రమార్కులు వ్యవస్థలోని పెద్దల అండదండలు లేకుండానే రెచ్చిపోయి ఉంటారా? బీహార్, రాజస్థాన్‌తో పాటుగా ప్రధాని సొంత రాష్ట్రమైన గుజరాత్‌లో నీట్ అక్రమార్కులు అరెస్టు కావడం దేనిని సూచిస్తున్నది? 'పరీక్షా పే చర్చా' అంటూ ఊదరగొట్టిన ప్రధాని మోదీ, టీఎస్‌పీఎస్సీలో అక్రమాలు జరిగాయంటూ నాడు చెలరేగిపోయిన బీజేపీ నాయకులు ఇప్పుడు నీట్ వివాదంపై మౌనం వహిస్తున్నారు. నీట్ పరీక్షపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల్లో నమ్మకం పూర్తిగా అడుగంటింది. నిప్పులాంటి నిష్పాక్షికతకు నిలువెత్తు దర్పణంలా నిలవాల్సిన పరీక్ష డబ్బులు వెదజల్లి సీట్లు పొందాలనుకునేవారికి ఆటస్థలమైంది. బ్రోకర్లు, ఏజెంట్లకు ఆడిందే ఆటగా పాడిందే పాటగా మారిపోయింది. పేదింటి బిడ్డలకు మెడికల్ సీటు అందని పండులా తయారైంది. నిలువెల్లా కుళ్లిపోయి కంపుకొడుతున్న నీట్ పరీక్షా విధానాన్ని సమూలంగా సమీక్షించాల్సిన అవసరం ఉన్నది. అంతకన్నా ముందు అక్రమాలకు బాధ్యులను పట్టుకుని శిక్షించాల్సిన అవసరముంది. అందుకు విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా సుప్రీంకోర్టు న్యాయమూర్తితో విచారణ జరిపించడం ఒక్కటే మార్గం.

ఇప్పటికీ చూస్తూనే ఉన్నాం!

అవినీతిపై స్పందించాలని చెప్పే మీరు (ప్రధాని మోదీ) మణిపూర్ అల్లర్లు, ఉగ్రవాదం లాంటి విషయాలపై ఎప్పుడూ మౌనంగానే ఉంటున్నారు. ఉగ్రవాదం, నగదు చెలామణి, అవినీతి అంతం అయిపోయాయని గతంలో చెప్పారు. కానీ, వాటన్నింటిని ఇప్పటికీ మనం చూస్తూనే ఉన్నాం.

- కపిల్ సిబల్, రాజ్యసభ సభ్యుడు

ఉభయులకూ భవిష్యత్తు సవాళ్లు

ఎన్డీయే, ఇండియా కూటములు రెండింటికీ తిరిగి ఎన్నికల సవాళ్లు త్వరలోనే ఎదురుకానున్నాయి. ఇదే సంవత్సరం మహారాష్ట్రలో, జార్ఖండ్‌లో, హర్యానాలో, తర్వాత 2026 లోగా అసోం, కేరళ, తమిళ నాడు, పుదుచ్చేరి, పశ్చిమబెంగాల్, ఢిల్లీ, బీహార్ అసెంబ్లీలకు. వీటిలో అసోం, హర్యానా, మహారాష్ట్ర, బీహార్‌లో ఎన్డీయే, తక్కినవాటిలో ఇండియా కూటమి పార్టీలు ప్రస్తుతం అధికారంలో ఉన్నాయి. ఎన్డీయే కూటమికి అసోం భద్రంగానే కనిపిస్తుండగా, మొన్నటి లోక్‌సభ ఫలితాలను బట్టి మహారాష్ట్ర, హర్యానా, బీహార్ స్థితి అనిశ్చితంగా మారింది. ఇండియా కూటమికి సంబంధించి వాటి రాష్ట్రాలు సురక్షితంగా కనిపిస్తున్నాయి. అందుకు అదనంగా, మహారాష్ట్రపై కూడా ఆశలు పెట్టుకోవచ్చుననే వాతావరణం ఉన్నది. ఒకవేళ వారు నిజంగానే మహారాష్ట్రను గెలవగలిగితే ఆ ప్రభావంతో తక్కిన రాష్ట్రాలు మరింత సురక్షితంగా మారుతాయి. ప్రధాని మోదీ ప్రయత్నాలు చేస్తున్న జమిలి ఎన్నికల పరిస్థితి ఏమి కాగలదన్నది అట్లుంచితే, ఈ తొమ్మిది అసెంబ్లీ ఫలితాల ప్రభావం 2029 లోక్‌సభ ఎన్నికలపై ఉండగలదని చెప్పవచ్చు. అయితే, ఇందుకు వర్తించే అతిపెద్ద షరతులు కూడా కొన్నున్నాయి.

టంకశాల అశోక్

రెండు కూటములు కూడా తమ గతం నుంచి పాఠాలు నేర్చుకుంటూ ముందుకు సాగటమన్నది వారు వేయవలసిన మొదటి అడుగు. ఎవరు ఎటువంటి పాఠాలు నేర్చుకుంటారు? మునుముందు ఏ విధంగా వ్యవహరిస్తారన్నది రెండవ ప్రశ్న. ఈ రెండింటిని కూడా దేశ ప్రజలు జాగ్రత్తగా గమనిస్తుంటారు. ఇప్పుడు వివరాలలోకి వెళ్తే, ఎన్డీయే ఈ లోక్‌సభ ఎన్నికలలో గెలిచిన తీరును బట్టి చూడగా, వారు ఇకనుంచి తమ తప్పులను సరిదిద్దుకుంటూ ముందుకు సాగవలసి ఉంటుంది. ఆ పని ప్రధాని మోదీ నాయకత్వాన కేంద్ర స్థాయితో పాటు, వారు పరిపాలిస్తున్న వివిధ రాష్ట్రాలలో కూడా జరగాలి. అట్లా జరగనందుకే స్వయంగా తాము అధికారంలో గల కేంద్రస్థాయితో పాటు, తమ రాష్ట్రాలు కొన్నింటిలోనూ బలం తగ్గింది. కనుక ఈ రెండు విధాల వారు తమ పాలనను, రాజకీయ పద్ధతులను మార్చుకోవలసి ఉంటుంది. మార్చుకోవలసిన అవసరాన్ని సాక్షాత్తూ తమ మాతృ సంస్థ ఆరెస్సెస్ అధినేత మోహన్ భాగవత్ చాలా సూటిగా ఎత్తిచూపిన తర్వాత, మోదీకి గాని, బీజేపీకి గాని మరొక ప్రత్యామ్నాయం లేదు కూడా. అందువల్ల మోదీ బృందం పైకి ఏమి మాట్లాడినా మాట్లాడకున్నా, రాగల రోజులలో ఆచరణాత్మకంగా తనను తాను ఏ విధంగా మార్చుకోగలదు? వచ్చే తొమ్మిది అసెంబ్లీ ఎన్నికలలో ఎటువంటి ఫలితాలు సాధించగలదన్నది పెద్ద సవాలు కానున్నది. ఆ ఫలితాలు మోదీతో పాటు రాగల కాలానికి బీజేపీ భవిష్యత్తును నిర్ణయించగలవు.

'ఇండియా' కూటమి విషయానికి వస్తే, ఈ ఎన్నికలలో అధికారానికైతే రాలేదు గాని, ఓడినా గెలిచినంతటి వాతావరణాన్ని సృష్టించగలిగారన్నది వాస్తవం. అటువంటి ఫలితాలకు ఒక కారణం మోదీ పట్ల ప్రజలలో కలిగిన వ్యతిరేకాభిప్రాయమైతే, రెండవ కారణం ఇండియా కూటమి నడిపిన పాజిటివ్ ప్రచారం. ఈ రెండింటిలో దేని ప్రభావం ఎంతో ఇతమిత్థంగా చెప్పటం అసాధ్యం గనుక ఆ విషయం అట్లుంచితే, ఆ రెండూ కారణాలన్నది గుర్తించాలి. మొత్తానికి ఈ విధమైన ఫలితాల నుంచి కాంగ్రెస్ గాని, ఇండియా కూటమి గాని నేర్చుకోవలసిందేమిటి? ఈసారి వారికి పలు విధాలుగా కాలం కలిసివచ్చింది గాని, గతంలోకి వెళ్లినా, వర్తమానంలోనైనా కాంగ్రెస్‌కు చాలా పాఠాలున్నాయి. అవేమిటో పార్టీ నాయకత్వం గతంలోకి తొంగి చూస్తే తనకే తెలుస్తాయి. ఆ విధమైన వైఫల్యాలు ఇంత సుదీర్ఘకాలం లేనట్లయితే వారు వరుసగా ఇన్ని పరాజయాలకు గురయ్యేవారు కాదు. పైన అన్నట్లు వారికి ఈసారి అనేకం కలిసివచ్చి మరిన్ని సీట్లయితే గెలిచారు గాని, తమ లోటుపాట్లు, వైఫల్యాలు ఏమిటో ఎన్నికలకు ముందు ఆత్మ పరిశీలన చేసుకున్నారా? మనకు తెలిసి అటువంటిదేమీ జరగలేదు. కొన్ని విషయాలు కలిసివచ్చి కొన్ని సీట్లు అదనంగా కలిసి అదే తమ ఘనత అనుకుంటున్నారు. ఈ ఘనత సాధించినందున ఇక గతం నుంచి నేర్చుకోవలసిందేమీ లేదని భావిస్తున్నారేమో తెలియదు. వారి స్వభావం మాత్రం లోగడ నుంచి అదే.

కాంగ్రెస్ నాయకత్వం గతం నుంచి పాఠాలు నేర్చుకోలేదనటానికి వారు అధికారంలో గల కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్‌ల లోక్‌సభ ఫలితాలే నిదర్శనం. హిమాచల్‌లో మొత్తం నాలుగు స్థానాలూ ఓడగా, తక్కిన రెండింటిలో సగమైనా గెలవలేకపోయారు. ముఖ్యంగా తెలంగాణ, కర్ణాటకలలో అట్టహాసంగా కొన్ని గ్యారంటీలు ఇచ్చారు. వాటిని అమలుపరచలేక సతమతమవుతున్నట్టు లోక్‌సభ ఎన్నికల నాటికే తేలింది.

ఎన్నికల అనంతరం ఆరు మాసాలలోనూ పరిస్థితి అదేవిధంగా ఉన్నది. ఆ హామీలు చాలక, కేంద్రంలో అధికారానికి వచ్చినట్లయితే అమలుపరచగలమంటూ మరికొన్ని హామీలు ప్రకటించారు. ఇటువంటివన్నీ కేవలం ప్రజలను మభ్యపెట్టి అధికారానికి వచ్చే ఎత్తుగడలని తేలుతూనే ఉన్నది. విషయమేమంటే, కాంగ్రెస్ నాయకత్వానికి వైఫల్యాలు, హామీలు, తిరిగి వైఫల్యాలు, వాటినుంచి ఎటువంటి పాఠాలు నేర్వకపోవటమన్నది ఒక షరామామూలు వలయంగా మారింది. గెలిచినప్పుడు తమ ఘనత అని నమ్మటం, ఓడినప్పుడు ప్రత్యర్థులను విమర్శించి సంతృప్తిచెందటం ఒక ఆత్మవంచనా కళ అయింది. ఈ సుదీర్ఘ నేపథ్యాన్ని బట్టి చూసినప్పుడు ఇప్పటి లోక్‌సభ ఫలితాలు ఇచ్చిన ఉత్సాహన్ని ఆధారం చేసుకుంటూ వారు రాగల తొమ్మిది అసెంబ్లీ ఎన్నికల నాటికి ఏమేమి చేయగలరన్నది పెద్ద సవాలు కానున్నది.

ఈ విధంగా, మొదట అనుకున్నట్టు, ఎన్డీయే, ఇండియా కూటములు రెండింటికీ కూడా రాగల కాలం వేర్వేరు విధాలైన సవాలు అవుతున్నది. మొదట ఎన్డీయేను చూసినట్టయితే, వ్యక్తిగతంగా మోదీ, సంస్థాపరంగా బీజేపీ, ఆరెస్సెస్ మారటమన్నది అన్నింటికన్న ముందు జరగవలసింది. మోదీకి సంబంధించి ఆయన తన అహంకారాన్ని, తనకు ఎదురులేదనుకోవటాన్ని, వ్యక్తిగత పోకడలను, నియంతృత్వ ధోరణులను వదులుకోవాలి. తన ఆర్థిక విధానాలను క్రోనీ క్యాపిటలిస్టు మిత్రులకు, విదేశీ పెట్టుబడిదారులకు గేట్లు పూర్తిగా తెరిచే పద్ధతి నుంచి మార్చుకోవాలి. ఉద్యోగాలు సృష్టించని ఆర్థికాభివృద్ధి (జాబ్‌లెస్ గ్రోత్), వ్యవసాయరంగ వ్యతిరేకతను వదిలివేయాలి. అల్పసంఖ్యాకవర్గాలపై విష ప్రచారాలను, చర్యలను మానివేయాలి. పౌరహక్కులను, పత్రికాస్వేచ్ఛను అణచివేయటం, తీవ్ర అసహన ప్రదర్శనలు పూర్తి అప్రజాస్వామికమని గ్రహించాలి. కేవలం ఆర్థికాభివృద్ధి, ర్యాంకుల వెంట పరుగులు తీయటం గాక, మానవాభివృద్ధి సూచికలు, అదే విధమైన ఇతర సూచికల విషయంలో దేశం ఎక్కడ ఉందన్న దానిపై దృష్టిపెట్టాలి.

పెద్ద పెద్ద ఆర్థిక నేరస్తులను తమ పార్టీలో చేర్చుకొని గంగాజలంతో పవిత్రులను చేయటం, ప్రత్యర్థులను దర్యాప్తు ఏజెన్సీలతో వేధించటం వంటివి మానుకోవాలి. అందరూ హీనులు, తాను మాత్రం మహా పవిత్రుడనంటూ తనను తాను ఆకాశాన్నంటే అత్యున్నత స్థానంపై ఆసీనుడిని చేసుకునే అల్పమైన బుద్ధిని ప్రదర్శించకూడదు. అమలుపరచటం అసాధ్యమైన రూ.15 లక్షల జమ, ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాల వంటి మోసపూరిత హామీలు, అకస్మాత్తుగా పెద్ద నోట్ల నిర్ణయం వంటి ఏకపక్ష నిర్ణయాలు పునరావృతం కాకూడదు. తమ పార్టీకి చెందిన నాయకులు ఇతర శ్రేణులు దేశవ్యాప్తంగా ప్రదర్శిస్తున్న ధూర్త ధోరణులను పూర్తిగా అరికట్టాలి. అదేవిధంగా ఆరెస్సెస్, ఇతర పరివార్ సంస్థలు కూడా తమ ఇంతకాలపు మెతక ధోరణిని, విపత్తు వచ్చినప్పుడు మాత్రమే మొన్నటి వలె పెదవి విప్పే పద్ధతిని వదిలివేసి, మోదీ వంటివారిని, ఆయన నిర్దేశంలో కట్టు తప్పి వ్యవహరిస్తున్న బీజేపీని నియంత్రించాలి. ఆ విధంగా అది కూడా వారికి సవాలవుతున్నది. అదే పద్ధతిలో బీజేపీ కూడా అధికార ఆనందంలో మైమరవటం కాక, ఒక పార్టీగా కొంత వెన్నెముక తెచ్చుకోవాలి.

కాంగ్రెస్ పార్టీ, ఇండియా కూటమి చేయవలసింది తక్కువ కాదు. ఇంకా చెప్పాలంటే బీజేపీ, సంఘ్ పరివార్‌ల కన్న ఎక్కువ. బీజేపీ, పరివార్‌లకు మంచో చెడో ఒక సిద్ధాంతం, లక్ష్యం ఉన్నాయి. అందుకు భిన్నంగా కాంగ్రెస్ తన సిద్ధాంతం, లక్ష్యం ఏమిటో నెహ్రూ తర్వాత మరిచిపోయింది. ఇందిర కాలంలో ఉండిన నటనలను కూడా వదిలివేసుకున్నది. తర్వాత ఆర్థిక సంస్కరణల అమలులో కనీస విచక్షణలను వదిలివేసి, ధనిక వర్గాల పార్టీగా మారి, సాధారణ ప్రజలకు, పేదలకు చాలా నష్టాలు చేసింది.

ఉద్యోగ–ఉపాధి కల్పన, పేదరిక నిర్మూలన మొక్కుబడి మాటలుగా మారాయి. అసమర్థ పాలన, అవినీతి, బంధుప్రీతి అదుపు లేకుండా సాగాయి. బీజేపీని ఎదుర్కోవటం చేతగాక, సాఫ్ట్ హిందూత్వ మార్గాన్ని ఎంచుకొని, మైనారిటీలను నిజంగానే ఓటు బ్యాంకుగా చూస్తూ, మానవాభివృద్ధి సూచీలు, పౌరహక్కులు తన హయాంలోనూ పతనమవుతూ పోగా సకల భ్రష్టత్వానికి గురైంది. ప్రతిపక్షాలపై కుట్రలు, వాటి ప్రభుత్వాల పట్ల వివక్షలు, రాజ్యాంగ దుర్వినియోగాలు, రాష్ట్రాల హక్కుల హరణలు అధికార కేంద్రీకరణలు వారి కాలంలో తక్కువేమీ కాదు. ఇటువంటి నానా వైఫల్యాల కారణంగానే కాంగ్రెస్ దేశమంతటా ప్రజల విశ్వాసాన్ని కోల్పోతూ, మనం చూస్తున్న దశకు క్షీణించింది. అందువల్ల ఆ పార్టీ ఈ పతన కారణాలన్నింటిని విశ్లేషించి క్రమంగా సరిదిద్దుకొనవలసి ఉంటుంది. అట్లాగే సిద్ధాంతపరంగా, ఆర్థిక, అభివృద్ధి విధానాల పరంగా ఒక స్పష్టమైన భవిష్యత్తు ప్రణాళికను రూపొందించుకోవాలి. దానిని ప్రజలలోకి తీసుకువెళ్లి అందుకు తాము త్రికరణశుద్ధిగా కట్టుబడి ఉండగలమనే విశ్వాసాన్ని కల్పించగలగాలి. అంతేతప్ప, 52 సీట్లను మిత్రపక్షాల తోడ్పాటుతో 99కి పెంచుకొని, ఇక భవిష్యత్తు బంగారుమయమని భ్రమించటం పొరపాటవుతుంది.

ఇండియా కూటమి విషయం కూడా అంతే. లోగడ ఏర్పడిన వివిధ ఫ్రంట్‌లు అధికారానికి రాగలిగి సైతం, తమకు ఒక సమగ్రమైన ఉమ్మడి అజెండా లేక, ఐక్యత అంతకన్నా లోపించి, కాంగ్రెస్ అవలక్షణాలలో అనేకం తమలోనూ ప్రవేశించి, చూస్తుండగానే కుప్పకూలాయి. బీజేపీ రాకకు అవసరమైన శూన్యాన్ని సృష్టించటంలో కాంగ్రెస్‌ది మొదటి బాధ్యత కాగా, వీరిది రెండవ బాధ్యత. కనుక, ఈ అనుభవాల నుంచి పాఠాలను కాంగ్రెస్‌తో పాటు తాము నేర్చుకోవాలి. ప్రస్తుతం అధికారంలో గల రాష్ట్రాలలో జనరంజక పాలన అందించవలసిన తప్పనిసరి బాధ్యత ఉభయులపైనా ఉంటున్నది. ఇక రాగల కాలంలో ఒక వైపు బీజేపీ, పరివార్‌లు, మరొకవైపు కాంగ్రెస్, ఇండియా కూటమి పార్టీలు ఏమి నేర్చుకొని, ఏ విధంగా వ్యవహరించి, దేశ ప్రజలకు ఆశాభావం కలిగించగలవో చూడాలి.

తప్పటడుగులు వేస్తున్న
తెలంగాణ

తెలంగాణ అంటే ఒక చైతన్యం, తెలంగాణ అంటే అస్తిత్వం, తెలంగాణ అంటే ఆత్మగౌరవం... ప్రజల చిరకాల వాంఛ అయిన ఈ తెలంగాణ రాష్ట్రాన్ని కేసీఆర్ చావు అంచులదాకా వెళ్లి సాధించారు. తెలంగాణ ప్రజలను ఏకం చేసి, పదవులను తృణప్రాయంగా వదిలి, పద్నాలుగేండ్ల సుదీర్ఘ ఉద్యమంతో తెలంగాణ రాష్ట్రాన్ని సాధించారు. ఇది చరిత్ర. చెరిపేస్తే చెరిగిపోని చారిత్రక వాస్తవం.

తెలంగాణ ఉద్యమంలో వందల మంది యువకులు ఆత్మ బలిదానాలు చేసుకున్నారు. వేలాది మంది ఉద్యమకారులు జైలు గోడలను ముద్దాడారు. లక్షలాది మంది ప్రజలు లాఠీ దెబ్బలు తిన్నారు. కోట్లాది మంది ప్రజలు రోడ్ల మీదికి వచ్చారు. తత్ఫలితంగానే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పాటైంది. తెలంగాణ రాష్ట్రానికి ఉద్యమ నేత కేసీఆర్ తొలి ముఖ్యమంత్రి అయ్యారు. ఆయన గత పదేండ్ల స్వల్పకాలంలో 60 ఏండ్ల దుర్భిక్షాన్ని పారద్రోలి తెలంగాణను అన్నపూర్ణ చేశారు. ఆకలిచావులు లేవు, ఆత్మహత్యలు లేవు. కేసీఆర్ దేశంలోని అన్నిరంగాల్లో తెలంగాణను అగ్రస్థానంలో నిలబెట్టారు. పాలనకు దిక్సూచిగా, పథకాలకు ఆదర్శంగా తెలంగాణను తయారుచేశారు. తాగు, సాగునీళ్లు, గురుకుల పాఠశాలలు, కల్యాణలక్ష్మి ఇలా, ఒకటా రెండా? వందల సంక్షేమ పథకాలు తెలంగాణలో అమలయ్యాయి. రాష్ట్రంలో సంక్షేమం అందని ఇల్లు లేదు, అభివృద్ధి జరుగని ఊరు లేదు.

మీడియాతో కలిసి విపక్షాలు కేసీఆర్ మీద, ఆయన కుటుంబం మీద విషాన్ని విరజిమ్మాయి. ఫలితంగా వ్యతిరేక తీర్పు వచ్చింది. 420 హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం కేవలం ఉచిత బస్సు హామీని అమలు చేస్తూ ఊరేగుతున్నది. కేసీఆర్ గద్దె దిగిన ఆరు నెలల్లో 24 గంటల కరెంటు మాయమైంది. సాగునీళ్లు లేక వ్యవసాయం కుంటుపడ్డది. పంటలు కొనే నాథుడు లేడు రైతు కంట నీరు తీస్తున్నాడు.

అమరులారా మన్నించండి. మీ అమరత్వంతో సాకారమైన తెలంగాణ ఇప్పుడు మానసిక వైకల్యంతో తప్పటడుగులు వేస్తున్నది. ఇది తాత్కాలిక సంక్షోభం. మళ్లీ కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణను ముందంజలో నిలబెడతాం. మీ ఆశయాలు సాధిస్తాం.

ఎస్వీ రమణారెడ్డి
99492 99699

తెలంగాణ తొలి ప్రభుత్వం గురుకుల విద్యాలయాలకు శ్రీకారం చుట్టి వాటిని దేశానికే ఆదర్శంగా నిలిపింది. గత ప్రభుత్వం చేసిన పనిని కొనసాగించేందుకు నిర్లక్ష్యం వహిస్తే అది బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల నుంచి తీవ్ర నిరసనను ఎదుర్కోవాల్సి వస్తుంది. పరాయి పాలకులు తెలంగాణ రాష్ట్ర అవతరణకు ముందు ప్రభుత్వ స్కూళ్లను నిర్వీర్యం చేసి కార్పొరేట్ విద్యా వ్యవస్థను పటిష్ఠం చేశారు. చదువును ఖరీదైన వస్తువుగా మార్చటంతో అది బహుజనవర్గాల బిడ్డలకు తీరని నష్టం చేసింది. ఆ నష్టాన్ని పూడ్చుతూ గత కేసీఆర్ ప్రభుత్వం 1,100 గురుకులాలు నెలకొల్పటంతో బహుజన వర్గాల బిడ్డలకు కార్పొరేట్ స్థాయి విద్య అందింది. తద్వారా బహుజన వర్గాల బిడ్డలు ర్యాంకులు కొట్టే దశకు వచ్చారు. 10వ తరగతి, ఇంటర్‌లలో గురుకుల విద్యార్థుల ఫలితాలు ఊహించని విధంగా పెరిగాయి.

గురుకులాలపై నిర్లక్ష్యమా?

జూలూరు గౌరీశంకర్

కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం గత ప్రభుత్వం చేసిన ప్రజోపకరమైన పనులను, సంక్షేమ పథకాల పేర్లను మార్చివేయాలనో లేదా రద్దు చేయాలనో చూడటం అప్రజాస్వామికం. తెలంగాణ రాష్ట్రంలో ప్రభుత్వ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థుల సంఖ్యను పరిశీలిస్తే 95 శాతానికి పైగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ విద్యార్థులున్నారు. ఇందులో బీసీ విద్యార్థులు 60 శాతంగా ఉన్నారు. రాష్ట్ర పాఠశాల విద్యాశాఖ తీసిన లెక్కల ఆధారంగా చూస్తే రాష్ట్రంలోని ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులు అత్యధిక శాతం బహుజన, దళిత, మైనారిటీ, గిరిజన, ఆదివాసీ వర్గాలకు చెందినవారేనని ప్రభుత్వ గణాంకాలు చెప్తున్నాయి.

తెలంగాణ రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థుల సంఖ్య 60,77, 070 కాగా, ఇందులో జనరల్ విద్యార్థులు 13,54,516 మంది, ఎస్సీ వర్గాల పిల్లలు 10,41,747 మంది, ఎస్టీ 6,74,618 మంది, బీసీలు 30,06,189 మంది ఉన్నారు. మొత్తం 60 లక్షల మందికి పైగా ఉన్న విద్యార్థులలో సగం మంది విద్యార్థులు బీసీలే అని సర్వశిక్షా అభియాన్ ఇచ్చిన లెక్కల ద్వారా తెలుస్తున్నది. 2022 లెక్కల ప్రకారం రాష్ట్రంలో మొత్తం ఉపాధ్యాయుల సంఖ్య 2,98,983 మంది ఉంటే, ఇందులో జనరల్ క్యాటగిరిలో మొత్తం 1,02,326 మంది, ఎస్సీ 39,645, ఎస్టీ 21,699, బీసీ(ఏ) 17,411, బీసీ (బీ) 56,838, బీసీ (సీ) 4,143, బీసీ (డీ) 41,951, బీసీ(ఈ) 14,970 మంది ఉన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు చెందిన టీచర్లు మొత్తం 1,96,657 మంది ఉంటే జనరల్ క్యాటగిరీ కింద టీచర్లు 1,02,326 మంది ఉన్నారు. ఈ లెక్కన రాష్ట్రంలో 90 శాతంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల టీచర్ల ప్రాతినిధ్యం పెరగవలసి ఉన్నది. బీసీలకు జనాభా దామాషా పద్ధతిలో రిజర్వేషన్లు కేటాయిస్తే బీసీ ఉపాధ్యాయుల సంఖ్య మరింతగా పెరుగుతుంది. ఇందులో ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులంతా బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల వాళ్లేనని ప్రభుత్వ లెక్కలు తేల్చి చెప్తున్నాయి.

గత కేసీఆర్ ప్రభుత్వం విదేశాల్లో చదివే బీసీ బిడ్డలకు రూ.20 లక్షలను మహాత్మా పూలే ఓవర్సీస్ స్కాలర్‌షిప్ ద్వారా అందించింది. ఇలా ఇంతకుముందు ఏ ప్రభుత్వమూ చేయలేదు. అలాగే దేశంలో ఏ రాష్ట్రంలోనైనా ఉన్నత విద్యనభ్యసిస్తున్న బీసీ విద్యార్థులకు ఎస్సీ, ఎస్టీ, విద్యార్థుల వలె పూర్తి ఫీజులు చెల్లించే పద్ధతికి కేసీఆర్ శ్రీకారం చుట్టారు. విద్యాహక్కు చట్టాన్ని పకడ్బందీగా అమలుచేస్తూ ప్రైవేట్ విద్యాసంస్థల్లో 25 శాతం అడ్మిషన్లు ఉచితంగా బీసీ, ఎస్సీ, ఎస్టీ, విద్యార్థులకు కల్పించాలి. ఫీజుల నియంత్రణ చట్టం తీసుకువచ్చి కార్పొరేట్ విద్యాసంస్థల దోపిడీని అరికట్టేందుకు ప్రభుత్వం కృషిచేయాలి. కేసీఆర్ దార్శనిక ఆలోచనలతో నెలకొల్పిన బీసీ గురుకులాలకు శాశ్వత భవనాలను నిర్మించే పనిని యుద్ధ ప్రాతిపదికపై చేపట్టాలి.

సాంకేతికతపై సందేహాలు!

ఈవీఎంలు సురక్షితమేనని, వాటిని వినియోగించవచ్చని సుప్రీంకోర్టు చెప్పిన తర్వాత కూడా వాటిని అనుమానాల నీలినీడలు వెంటాడుతూనే ఉన్నాయి. ఈవీఎంలను ట్యాంపరింగ్ చేసి, అనుకున్న ఫలితాలను రాబట్టవచ్చని కొందరు నిపుణులు ప్రదర్శనలు ఇచ్చిన సందర్భాలున్నాయి. కానీ, ఆ ఆరోపణలను ఎప్పటికప్పుడు ఈసీ కొట్టిపారేస్తూ వచ్చింది. అయితే తాజాగా ఎలాన్ మస్క్ ఈవీఎంల విశ్వసనీయతను ప్రశ్నిస్తూ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి.

ఎడిటోరియల్ డెస్క్

వ్యక్తులు లేదా కృత్రిమ మేధ (ఏఐ) నుంచి ఈవీఎంలకు హ్యాకింగ్ ముప్పు పొంచి ఉన్నదనే ఎలాన్ మస్క్ ప్రకటన కలకలం రేపింది. ఈవీఎంలను ఎన్నికల ప్రక్రియ నుంచి తొలగించాలని మస్క్ సూచించడం గమనార్హం. అమెరికాలోని ప్యూర్టోరికో ప్రైమరీ ఎన్నికల్లో ఈవీఎంలకు సంబంధించి అక్రమాలు వెలుగులోకి వచ్చాయని అమెరికా అధ్యక్ష ఎన్నికల బరిలో ఉన్న రాబర్ట్ ఎఫ్ కెన్నెడీ జూనియర్ తన 'ఎక్స్' పేజీలో ఆరోపించగా.. ఆ పోస్టుపై ఎలాన్ మస్క్ స్పందించారు. మస్క్ చేసిన వ్యాఖ్యలు భారత్‌కు సంబంధించినవి కాకపోయినప్పటికీ మన దేశంలో అగ్గి రాజుకుంది. మస్క్ వ్యాఖ్యలపై మాజీ కేంద్ర ఐటీ శాఖ మంత్రి, బీజేపీ నేత రాజీవ్ చంద్రశేఖర్ స్పందించారు. ఇంటర్నెట్‌తో అనుసంధానమై ఉండే ఓటింగ్ యంత్రాలు వాడే అమెరికాకు మాత్రమే మస్క్ వ్యాఖ్యలు వర్తిస్తాయని, భారత్‌లో హ్యాకింగ్ సాధ్యపడదన్నారు. దీంతో 'సాంకేతికంగా దేనినైనా హ్యాకింగ్ చేయడం సాధ్యమేనని, కానీ భారత్‌లో అది సాధ్యం కాదు' అని పేర్కొంటూ రాజీవ్ తప్పించుకొన్నారు.

మరోవైపు సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలువడి ఇప్పటికే రెండు వారాలు గడుస్తున్నా నేటికీ రోజుకో వివాదం తెరపైకి వస్తూనే ఉన్నది. పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్లకు మధ్య భారీగా వ్యత్యాసం ఉండటం ఇప్పుడు తాజా వివాదం. ఈ మేరకు 'ది వైర్'లో సంచలన కథనం ప్రచురితమైంది. ఆ కథనం ప్రకారం.. దేశంలోని కొన్ని సెగ్మెంట్లలో పోలైన ఓట్లకు, లెక్కించిన ఓట్లకు మధ్య 2 నుంచి 3,811 ఓట్ల వరకు వ్యత్యాసం ఉండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. కొన్నిచోట్ల పోలైన ఓట్ల కంటే ఎక్కువ ఓట్లను లెక్కలోకి తీసుకోగా.. మరికొన్నిచోట్ల పోలైన ఓట్ల కంటే తక్కువగా లెక్కించడమూ అనుమానాస్పదంగా మారింది. లక్షద్వీప్, డామన్ డయ్యూ, అట్టింగల్ మినహా దేశంలోని అన్ని నియోజకవర్గాల్లో స్వల్పంగానైనా ఓట్ల వ్యత్యాసం ఉన్నట్టు వెల్లడికావడం ఆందోళన కలిగిస్తున్నది.

దేశంలోని అనేక నియోజకవర్గాల్లో గెలుపు, ఓటములకు మధ్య చాలా తక్కువ ఓట్ల తేడా ఉండటంతో ఈ అంశం ఇప్పుడు దేశాన్ని కుదిపేస్తున్నది. ఇలా పోలైన ఓట్లు, లెక్కించిన ఓట్ల మధ్య వ్యత్యాసం ఉండి, చాలా తక్కువ మెజారిటీతో గెలుపుతీరాలకు చేరినవారిలో అత్యధికులు ఎన్డీయే అభ్యర్థులే ఉండటం చర్చనీయాంశమవుతున్నది.

ఈ ఎన్నికలకు సంబంధించి ఈసీ వ్యవహారం కూడా మొదటినుంచీ వివాదాస్పదంగానే ఉన్నది. ఎన్నికల రోజు వెల్లడించిన ఓటింగ్ శాతానికి, ఆ తర్వాత ప్రకటించిన తుది శాతానికి అసలు పొంతనే కుదరలేదు. మొదటి విడత ముగిసిన 11 రోజులకు, రెండో విడత పూర్తయిన నాలుగు రోజుల తర్వాత తుది ఓటింగ్ శాతాలను ప్రకటించడం పట్ల తీవ్ర విమర్శలు వచ్చాయి. డిజిటల్ యుగంలోనూ తుది శాతాలను వెల్లడించేందుకు 11 రోజుల సమయం ఎందుకు పట్టిందనే ప్రశ్నకు ఈసీ సరైన వివరణ ఇవ్వలేదు. పైగా మొదటి ఐదు విడతల వరకు ఓట్ల శాతాలను మాత్రమే ఈసీ ప్రకటించింది. నియోజకవర్గాల వారీగా పోలైన ఓట్లెన్ని? బూత్‌ల వారీగా ఎన్ని ఓట్లు పోలయ్యాయి? పురుషులు ఎంత మంది? మహిళలు ఎంతమంది? లాంటి వివరాలేవీ ప్రకటించలేదు. కాంగ్రెస్ సహా విపక్ష పార్టీలు తీవ్రస్థాయిలో విమర్శించడంతో చాలా ఆలస్యంగా పూర్తి వివరాలను ఈసీ వెల్లడించింది. మొదటి విడతకు ముందు ఏప్రిల్ 18న కేరళలోని కాసర్‌గోడ్‌లో నిర్వహించిన మాక్‌పోలింగ్‌పై కూడా ఆరోపణలు వెల్లువెత్తాయి. ఏ బటన్ నొక్కినా బీజేపీకే ఓట్లు పడుతున్నాయని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. దీంతో పాటు పోలైన ఓట్ల కంటే ఒక ఓటు ఎక్కువగా లెక్కలోకి వచ్చినట్టు పలువురు తెలిపారు. అయితే ఈ ఆరోపణలను తోసిపుచ్చిన ఈసీ వారి అనుమానాలను నివృత్తి చేయకపోగా.. 'ఇది ఉత్తుత్తి పోలింగే' నంటూ చేతులు దులుపుకొన్నది.

ఈవీఎలంపై ఆరోపణలు వస్తుండటంతో అనేక అభివృద్ధి చెందిన దేశాలు ఈవీఎంల వాడకాన్ని నిషేధించాయి. వాటిని పక్కకుపెట్టేసి బ్యాలెట్ వైపు మళ్లాయి. అయితే మన దేశంలో ఈవీఎంలపై సందేహాలు, అనుమానాలు తలెత్తుతున్నప్పటికీ ఈసీ వాటిని నివృత్తి చేయడం లేదు. ఇదే విషయాన్ని ప్రస్తావిస్తూ.. భారత్‌లోని ఈవీఎంలు బ్లాక్ బాక్స్ లాంటివని, వాటిని పరిశీలించేందుకు ఎవరికీ అనుమతి లేదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ విమర్శించారు. ఏపీ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన వైసీపీ కూడా ఈవీఎంల వైపే వేలు చూపిస్తున్నది. ఈవీఎంలపై భరోసా లేనప్పుడు వాటిని వాడటం అవసరమా? అని చాలామంది ప్రశ్నిస్తున్నారు. సాంకేతికతను వినియోగించుకోవడం మంచిదే. అది అందరికీ ఆమోదయోగ్యంగా ఉన్నంతవరకు ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ, ఒక్కసారి సాంకేతికతపై సందేహం కలిగితే మాత్రం ఎన్ని అప్‌గ్రేడ్‌లు చేసినా, ఎన్ని వెర్షన్‌లు మార్చినా ప్రయోజనం ఉండదు.